క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



మల్హర్: పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ 542 ఆధ్వర్యంలో మండలంలోని కొయ్యూరు కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు చింతల తేజోరాం, చాందిని, స్ఫూర్తి, అమూల్య, నక్షత్ర, సాగర్‌లను సొసైటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్ల శంకర్ శాలువాలతో సత్కరించి, రమాబాయి జీవిత చరిత్ర గ్రంథాలు, జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, ఏవైయూ కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్, కార్యవర్గ సభ్యుడు బండి రాజయ్య, రావుల మొగిళి, కొండ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లో ఈ నెల 25, 26న నిర్వహించే పటేల్ ఎంటర్ ప్రేన్యూర్స్ నెట్‌వర్క్ మహోత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పెన్ వలంటీర్ డాక్టర్ శ్రీనివాస్ కస్తూరి సాయికృష్ణ, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మున్నూరు కాపు కుల వ్యాపారస్తులకు అన్ని వర్గాల వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, కావున అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

ఘనంగా మైసమ్మ జాతర



వాజేడు: మండల పరిధిలోని కాచారం వద్ద మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు తల్లడి పాపారావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి గోదావరి నుంచి జలాలను పారేటి కుండల్లో బాలికలతో తీసుకువచ్చి మైసమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత




కాళేశ్వరం: కాళేశ్వరం గ్రామానికి చెందిన రచ్చ బానక్క మంచిర్యాల జిల్లా చెన్నూర్ ప్రాంతంలో ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. బాధితురాలు కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై భవానిసేన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితురాలుకు ఆదివారం అందజేశారు.

అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు



శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో గల అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు చెలరేగాయి. రోడ్డు ప్రక్కన పడేసిన కంకి బెండ్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంఒ అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. గతంతో కూడా అవెన్యూ ప్లాటేంషన్‌లో మొక్కలు కాలిపోయిన విషయం తెలిసిందే. హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్షలాది రూపాయల నిధులతో చేపడుతున్న అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు కాలిపోతుండడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యంతో బాలింత మృతి


రాశి(ఫైల్)

కాటారం: అనారోగ్యంతో బాలింత మృతి చెందిన సంఘటన కాటారం మండలం ఒడిపిలవంచలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దండ్రు రాశి(28) ఇటీవల పాపకు జన్మనిచ్చింది. గతంలో ఓ సర్జరి కాగా ఇప్పుడు సైతం సర్జరి కావడంతో అనారోగ్యం పాలయింది. ఏడాది సమయంలో రెండు సర్జరీలు కావడంతో తీవ్ర అస్వస్థతకు గురైన రాశి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో క్రికెట్ కోచింగ్
- ఏజెన్సీ నుంచి వస్తున్న క్రీడాకారులు


సమ్మర్ క్యాంపునకు హాజరైన క్రీడాకారులు


ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

ములుగు: గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసక్తి ఉన్న క్రీడాకారులను వెలికి తీసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గత నెల 20 నుంచి ఇస్తున్న వేసవి క్రికెట్ కోచింగ్ ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగుతుంది.

110 మందికి శిక్షణ

శిక్షణ శిబిరంలో ఉదయం 6గంటల నుంచి తొమ్మిది గంటల వరకు సెషన్‌ను నడిపిస్తున్నారు. మొత్తం 110 మంది ప్రస్తుతం కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందులో అండర్ 14లో 30 మంది, అండర్ 16లో 35 మంది, అండర్ 19లో 20 మంది, అండర్ 23లో 10 మంది అలాగే అన్ని విభాగాల్లో 15 మంది బాలికలు ఉన్నారు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి, వాజేడు మండలం, వెంకటాపురం(ఎం) మండలం నల్లగుంట వంటి ప్రాంతాల నుంచి క్రమం తప్పకుండా ప్రతి రోజు శిక్షణకు వస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే వేసవి శిక్షణ క్యాంప్ ఇన్‌చార్జ్, కోచ్ సందీప్‌నేత్ర ఆటలోని మెళకువలను అందిస్తూ బౌలింగ్, కీపింగ్ టెక్నిక్, బ్యాటింగ్ పొజిషన్, లాంగ్ డ్రైవ్, స్ట్రేయిట్ డ్రైట్, బ్యాక్‌ఫుట్ డ్రైవ్, లాంగ్ ఆన్, లాంగ్ ఆఫ్‌లో ఆడే విధానంపై నేర్పుతున్నాడు.

అండగా హెచ్‌సీఏ

హెచ్‌సీఏ ఆధ్వర్యంలో క్రీడాకారులు అరటిపండ్లు, గుడ్లు, స్నాక్స్ వంటి అందిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తరువాత క్రీడాకారులకు సర్టిఫికేట్లు అందించనున్నారు. వీటితో పాటు క్రికెట్ జంబో కిట్, నెట్స్, బాట్, బాల్స్ వంటి వాటిని హెచ్‌సీఏ అందించింది.

21 నుంచి డబ్ల్యూడీసీఏ క్రీడలు

నేటి(సోమవారం)తో హెచ్‌ఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచింగ్ ముగియనుంది. కాగా, ఈ నెల 21 నుంచి వరంగల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(డబ్ల్యూడీసీఏ) క్రీడలు మొదలుకానున్నాయి. డబ్ల్యూడీసీఏ సెక్రటరీ శ్రీనివాస్ కోచింగ్ సెంటర్‌ను పరిశీలించి మెచ్చుకున్నారు. అండర్-14 నుంచి అండర్ 23 వరకు క్యాంపులో శిక్షణలో రాణించిన 16 మంది సెలక్ట్ చేయనున్నట్లుగా కోచ్ తెలిపారు. ఏజ్ గ్రూప్ ప్రకారం డిసెంబర్ వరకు రాష్ట్రంలో జరిగే పలు టోర్నమెంట్, సెలక్షన్స్‌కు క్రీడాకారులను పంపిస్తున్నట్లు తెలిపారు.

ఆటపై పట్టు సాధించా..



మాది ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి. రంగారెడ్డి జిల్లా కమ్మదనం సోషల్ వెల్ఫేర్‌లో చదువుకుంటున్నా. ములుగులో క్రికెట్ కోచింగ్ ఇస్తున్నారని తెలిసి అండర్-14కి రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ప్రతి రోజు కోచింగ్ హాజరవుతున్నా. క్రికెట్‌పై పట్టునేర్చుకున్నా. ఎక్కడ తడబడినా కోచ్ దగ్గరుండి నేర్పిస్తున్నారు. జిల్లా టోర్నమెంట్ ఆడేలా నాలో ధైర్యం వచ్చింది.

– సకినాల సౌముల్య, చిన్నబోయినపల్లి

ఎక్కడైనా ఆడగలుగుతా..



నేను ఇంటర్ వరకు చదువుకున్నా. క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. సోషల్ మీడియాలో కోచింగ్ గురించి తెలుసుకొని కోచ్ సందీప్‌ను కలిశాను. ఆయన సాయంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. కోచ్ సందీప్ సార్ చాలా మంచి మంచి టెక్నిక్ నేర్పించారు. ఇప్పుడు ఎక్కడైనా ఆడలగలను అనే ఆత్మవిశ్వాసం నాలో పెరిగింది. హెచ్‌సీఏకి, కోచ్‌లకు రుణపడి ఉంటా.

– నాగప్రకాశ్, వాజేడు

హెచ్‌సీఏ సాయంతో శిబిరం



హెచ్‌సీఏ సాయంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గత నెల 20వ తేదీ నుంచి 110 మందికి క్రికెట్ కోచింగ్ ఇస్తున్నాం. ఉదయం క్రీడాకారులు రావడంతో ముందుగా ఫిట్‌నెస్ ట్రెనింగ్ ఇస్తున్నాం. తదనంతరం బౌలింగ్, బ్యాటింగ్ , ఫీల్డింగ్, కీపింగ్ పై మెలకువలు నేర్పిస్తున్నాం. జిల్లాకేంద్రంలో మైదానం కేటాయిస్తే మరింత మందిని బయటి తీసేందుకు ప్రయత్నాలు చేయవచ్చు.

– సందీప్‌నేత్ర, సమ్మర్ క్యాంప్ ఇన్‌చార్జ్, కోచ్

రోడ్డు దిగిన లారీ.. తప్పిన ప్రమాదం



ఎస్ఎస్‌తాడ్వాయి: లారీ అదుపు తప్పి రోడ్డు దిగిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే.. పస్రా నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న లారీ తాడ్వాయిలోని సీసీఐ స్కూల్ సమీపంలో అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డు దిగింది. రోడ్డు కింద ఇళ్లకు ప్రమాదం తప్పింది. డ్రైవర్ అతివేగంగా లారీ నడపడంతో అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు. లారీల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదానికి గురైన జీపు



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ సమీపంలో జీపు ప్రమాదానికి గురైంది. ఏటూరునాగారం గ్రామం వైపు నుంచి వెంకటాపురం(కె) వైపు వెళ్తుండగా అదుపు తప్పి కింద పడినట్లు తెలిసింది. అందులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని సమాచారం. టైర్లు దెబ్బతిని ఉండటంతో పంక్చర్ కావడంతొనే ప్రమాదానికి గురై ఉంటుందని జీపును చూసిన వారు భావిస్తున్నారు.

అధ్వానంగా రహదారి


నిమ్మగూడెం, యత్నారం రహదారిపై ఏర్పడిన గుంతలు


యత్నారం వద్ద ధ్వంసమైన రోడ్డు

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మహాముత్తారం: మండలంలో ప్రధాన రహదారులు భారీ గుంతలు ఏర్పడి కంకర లేచి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని నిమ్మగూడెం నుంచి యత్నారం వరకు వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలు ఏర్పడి కిలోమీటర్ల కొద్ది కంకర లేవడంతో పాటు కల్వర్టులు సైతం భారీగా కోతకు గురయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నుంచి వెళ్లే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు ధ్వంసమై సంవత్సరాలు గడిచిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ఈ రహదారి గుండా ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని నిమ్మగూడెం, యత్నారం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ రమేష్‌ను వివరణ కోరగా అటవీశాఖ అనుమతులు లేనందున రోడ్డు నిర్మాణం చేపట్టలేక పోతున్నామని తెలిపారు. అటవీశాఖ అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు.

సుందరయ్య పోరాట యోధుడు


సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

వాజేడు: పుచ్చలపల్లి సుందరయ్య పోరాట యోధుడని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు అన్నారు. మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ధీరుడు పచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. నిరంకుశత్వం, దోపిడీ, పీడన లేని సమ సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని వర్ణించారు. ఈ కార్యక్రమంలో జెజ్జరి దామోదర్, గుగ్గిళ్ల దేవయ్య, రామ లక్ష్మి, సీత, నాగరాజు, సోనియా, సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి


గోవిందరావుపేట: మాట్లాడుతున్న చింత క్రాంతి


కన్నాయిగూడెం: మాట్లాడుతున్న నాయకులు

గోవిందరావుపేట: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్నకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింత క్రాంతి పిలుపునిచ్చారు. మండలంలోని పస్రాలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పదేండ్ల పాలనలో దొరల అహంకారం అక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం, యువత భవిష్యత్ నిర్వీర్యం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కు రణదీప్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు కోరం రామ్మోహన్, గొంది కిరణ, చెరుకుల సురేష్, తదితర యూత్ నాయకులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక అయిన మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాయ కరమ్ చంద్, వైస్ ఎంపీపీ బోల్లే బాస్కర్, నాయకులు అబ్బు రమేష్, రాంబాబు, సత్యం, నాగేష్, ప్రభాకర్ మధుకర్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పి మృతి చెందిన గురువులకు, తోటి విద్యార్థులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని నెమరువేస్తుకున్నారు. గురువులు హెచ్‌ఎం సారంగాపాణి, ఉపాధ్యాయులు వీరగంటి రవీందర్, నరేందర్, సదయ్య, కర్తీక్, సరిత, రాధిక, ప్రకాశ్, ఓనపాకల కుమార్‌లతో పాటు పలువురికి శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాసు రమేష్, మాటూరి లవన్‌బాబు, కటుకూరి సునీల్, కుషన్‌బాబు, కటుకూరి రాజేందర్, టేకు సతీష్, దాసారపు సృజన్, సతీష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని అంతరాష్ట్ర బార్డర్ చెక్‌పోస్టు వద్ద ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తని ఖీ చేపట్టారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వచ్చిపోయే వాహనాలపై దృష్టిసారించారు. అనుమానితులను విచారించి వదిలేస్తున్నారు.

శ్రమదానం


శ్రమదానం చేస్తున్న స్థానికులు

వాజేడు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో శ్రమదానంతో రహదారిని స్థానికులు బాగు చేసుకున్నారు. స్థానికులు చదర్‌రావు, సతీష్, లక్ష్మణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న భరత్

రేగొండ: నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు బీసీ ప్రజా సంఘం అధ్యక్షుడు నాయిని భరత్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చామని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఉన్నత స్థానం కల్పించాలని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా బీసీ ప్రజా సంఘం అధ్యక్షుడిగా బొజ్జం ప్రవీణ్‌ను నియమించినట్లు భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బండారి దేవేందర్, ఉమ్మడి జిల్లా యూత్ అధ్యక్షుడు అవూనూరి సతీష్, నాయకులు కోటి, రాజు, కిరణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాయంపేటలో ప్రెస్‌క్లబ్ నూతన భవన నిర్మాణానికి సహకారం ఉంటుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రేగొండ: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండి సదయ్య రోజులాగే తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి కల్లు గీత కార్మికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

రేగొండ: మండలంలోని గడిపల్లి గ్రామానికి చెందిన బండి కోటేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి యూత్ నాయకులు పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు ఎంజాల అనిల్, తాళ్లపల్లి రాజు, మంతెన తిరుపతి, రాము, నరేష్ పాల్గొన్నారు.